క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



కాజీపేట అర్బన్: కార్యకర్తల కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ పరిధిలోని తరాలపల్లి గ్రామానికి చెందిన రాముల రవి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా బీఆర్ఎస్ పార్టీ క్రియాశీల సభ్యత్వ ఇన్సూరెన్స్ రూ.2 లక్షల చెక్కును మృతుడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, రామచంద్రారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా జగదీశ్వర్



న్యూశాయంపేట: వరంగల్ జిల్లా చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడిగా రంగశాయిపేట శ్రీసాయినగర్‌కు చెందిన రామానుజమ్ జగదీశ్వర్ స్వామి ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వరయోగుల శ్రీనివాసస్వామి, ఆర్థిక కార్యదర్శిగా గిరిధర్‌స్వామి, ఉపాధ్యక్షుడిగా చందర్‌స్వామి, ఉపాధ్యక్షురాలుగా ప్రభావతితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులకు ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.


కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

కాజీపేట: పోరాడి సాధించుకున్న తెలంగాణలో కొనసాగుతున్న కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. మంగళవారం 62వ డివిజన్ అధ్యక్షుడు భగవాన్‌దాస్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో గాంధీనగర్, యాదవనగర్ ప్రాంతాల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో చిర్ర నర్సింగ్‌గౌడ్, మేకల శ్రావణ్, ఆకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ బోధనను ప్రయోగాత్మకంగా నిర్వహించాలి

విద్యారణ్యపురి: సైన్స్ ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా బోధించినప్పుడే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవడుతుందని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ కేంద్రంలో సూర్యకిరణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ కిట్ల వితరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, హెచ్ఎం ఆదిరాజు శైలజ, సైన్స్ కిట్ల దాత తూడి విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కాసం శశికళాధర్, సత్తు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

కేయూ రిటైర్డ్ ఆచార్యులు మృతి



సింగరాచార్య (ఫైల్)

కేయూ క్యాంపస్: కేయూ మైక్రోబయాలజీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఎంఏ సింగరాచార్య (68) మంగళవారం రాత్రి మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. గత కొంతకాలంగా సింగరాచార్య అనారోగ్యంతో బాధపడుతూ కోమాలో ఉన్నారు. మంగళవారం రాత్రి ఆయన స్వగృహం హనుమకొండలోని టీచర్స్ కాలనీలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడు పర్యావరణ సూక్ష్మ జీవశాస్త్రం పరిశోధన, విద్యాబోధనలో దేశవ్యాప్తంగా మంచి పేరుంది. తొలుత కేయూ బాటనీ విభాగంలో అసిస్టెంట్ ఆచార్యులుగా 1983లో నియమితులై 1993 వరకు పనిచేశారు. అంచెలంచెలుగా ఎదుగుతూ మైక్రోబయాలజీ విభాగం అధిపతిగాను, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, సీడీసీ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కొంతకాలంపాటు కేయూ రిజిస్ట్రార్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. అధ్యాపక వృత్తిలో ఉండి 2015లో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన మృతి పట్ల మైక్రో బయాలజీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు గిరీషం, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ఆచార్యులు డాక్టర్ బి.వెంకటగోపినాథ్ సంతాపం తెలిపారు.

ఉపవాసంతో ఆకలి బాధ తెలుస్తుంది

న్యూశాయంపేట: ఉపవాసం దీక్షతో ఆకలి బాధ తెస్తుందని, పవిత్ర రంజాన్ మాసంలో నిష్ఠ, నిగ్రహలతో ఉపవాసాలు పూర్తి చేసి అల్లా ప్రేమకు పాత్రులవ్వాలని ట్రిమిస్ ఆర్ఎస్‌సీ శ్రీపాల అన్నారు. సోమవారం రాత్రి పున్నేల్ క్రాస్ రోడ్డులోని బాలుర మైనార్టీ గురుకులంలో ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, కార్పొరేటర్

విద్యారణ్యపురి/నయీంనగర్: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవాలంటే ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకోవాలని ఆరో డివిజన్ కార్పొరేటర్ పి. మధు అన్నారు. పోషణ పక్షం సందర్భంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా స్థాయి పోషణ పక్షం కార్యక్రమం హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమాధికారిణి కె.మధురిమ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ ఎ.శ్రీవాణి, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు దామోదర్, హెచ్ఎం ఉమ, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, రమాదేవి, ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ చందన

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

ఖిలా వరంగల్: చిరుధాన్యాలతోపాటు ఐరన్‌కు సంబంధించిన బెల్లం, నువ్వులు, ఆకుకూరలు ఆహారంలో ఎక్కువగా ఇస్తే పిల్లలు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన సూచించారు. రంగశాయిపేట ఉన్నత పాఠశాలలో సీడీపీఓ విశ్వజ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచి పిల్లలకు బలమైన ఆహారం ఇస్తే ఎదుగుదలతోపాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు వనిత, అనిత, జ్యోతిరాణి, హైమావతి, యశోద, నజీమా, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.



మడికొండ: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు, మహిళలు

మహిళలచే ప్రతిజ్ఞ

మడికొండ: పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలచే రాగి జావ, రాగి లడ్డు, రాగి దోశ, మొదలగు వంటకాలను చేయించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ శారద చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గర్భిణులు, పిల్లల తల్లులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, పద్మావతి, స్వరూప, సంధ్య, ఏఎన్ఎం సంగీత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కుడా చైర్మన్

నయీంనగర్: రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. మంగళవారం గ్రేటర్ పరిధిలో కుడా ఆధ్వర్యంలో చేపట్టిన దేశాయిపేటలో సీసీ రోడ్డు, ఏనుమాముల రెడ్డిపాలెం జంక్షన్ అభివృద్ధి, ఆరెపల్లి రోడ్డు నుంచి రిలీఫ్ ఆస్పత్రి వరకు నిర్మించనున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రఘునందన్‌రావు, ఏఈలు భరత్, జలాల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఖిలా వరంగల్: సీజనల్‌గా వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ గణేష్, కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ 37వ డివిజన్ శంభునిపేట గిరిప్రసాద్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో ఆయుర్వేద వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ దుర్గాబాయ్, డాక్టర్ మైదంరాజు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం లక్షణాలను కనిపిస్తే వెంటనే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



పరీక్ష సామగ్రి అందజేస్తున్న వెంకటరమణ

కాశిబుగ్గ: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వన్నాల అరవింద్‌కుమార్ సమాఖ్య ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకటరమణ సూచించారు. మంగళవారం వీఏకే ఫౌండషన్ ఆధ్వర్యంలో నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 125 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో రూ.10వేలు, ద్వితీయ సంవత్సరంలో రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20వేల అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్, సాయికుమార్, కోట సతీష్, కోమాకుల నాగరాజు, వన్నాల వెంకన్న, కారంపూడి ఉమేష్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

ఖిలా వరంగల్: ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్, మాథ్స్ ఒలింపియాడ్‌లో వరంగల్ చార్‌బౌలి, ఎల్.బీ.నగర్‌లోని లర్నర్స్ ఐల్యాండ్ పాఠశాల విద్యార్థులు జైద్, శ్రీహస్విత్ అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు మంగళవారం ఎల్‌బీనగర్‌లోని లర్నర్స్‌ల్యాండ్ పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యాసంస్థల అధినేత తాళ్ల మల్లేశం, ప్రిన్సిపాల్ తాళ్ల యూనస్ రాణి విద్యార్థులకు మెమెంటోను అందజేసి అభినందించారు.

అవగాహన సదస్సు

కాజీపేట అర్బన్: హన్మకొండ సుబేదారిలోని పింగిలి కళాశాలలో మంగళవారం హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్, పింగిలి మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా గణిత శాస్త్రంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



క్రీడలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

కాశిబుగ్గ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఓ సిటీ స్టేడియంలో మహిళలకు మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, డివిజన్ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, పెండ్యాల సోనిబాబు, తోట బాలరాజు, చిమ్మని గోపి, దేవరాజు, దయాకర్, మహిళలు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ రైల్వేగేట్ శాంతినగర్‌లో ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు నన్నపునేని వాణి ఆధ్వర్యంలో ఉత్సాహంగా మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ హాజరై క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత ముస్కమల్ల సుధాకర్, వినయ్, మహిళలు పాల్గొన్నారు.

వృద్ధురాలిని అక్కున చేర్చుకున్న సహృదయ



వృద్ధురాలిని సహృదయ ఆశ్రమానికి తరలిస్తున్న నిర్వాహకులు

కాజీపేట: నా అనే వారు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 85 సంవత్సరాల వృద్ధురాలిని మంగళవారం సహృదయ ఆశ్రమ నిర్వాహకులు అక్కున చేర్చుకున్నారు. కడిపికొండ గ్రామానికి చెందిన కేశబోయిన కొమురమ్మకు ఇద్దరు సంతానం కాగా వారు గతంలోనే అనారోగ్యంతో మృతిచెందారు. కొన్ని రోజుల కిందట భర్త వెంకటయ్య కూడా అనారోగ్యంతో కాలంచేశాడు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న కొమురమ్మ గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి కొమురమ్మ తీవ్రంగా అస్వస్థతతకు గురి కాగా గుర్తించిన ఏఎన్ఎం జ్యోతి సహృదయ ఆశ్రమ నిర్వాహకులకు సమాచారం చేరవేశారు. స్పందించిన ఆశ్రమ నిర్వాహకులు ఎండీ.అలీ (చోటు) గ్రామానికి చేరుకొని కొమురమ్మను ఆశ్రమానికి తరలించారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

ఖిలా వరంగల్: తాళం వేసి ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటన శివనగర్ పల్లవి ఆస్పత్రి లేన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. రంగు వేణు అలియాస్ భాస్కర్ అనే వ్యక్తి శివనగర్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు మెయిన్ డోర్ గడియను ధ్వంసం చేసి బీరువాలోని రూ.4లక్షల నగదు, ఏడు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా మెయిన్ డోర్ గడియ ధ్వంసమై ఉంది. దీంతో బాధితుడు మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేశారు. హుటాహుటిన క్లూస్ టీమ్, ఎస్సైలు కుమార్, సుమన్, సాంబయ్యలతో కలిసి ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించి ఆధారాలు సేకరించారు. రూ.4లక్షల నగదు, ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

బాలుడిని ఎత్తుకెళ్లిన మానసిక రోగి



రామన్నపేట: వరంగల్ నగరంలోని డాక్టర్స్ కాలనీలో మంగళవారం రాత్రి ఓ నాలుగు సంవత్సరాల బాలుడిని సంచిలో మూటకట్టుకుని తీసుకెళ్తున్న మానసిక రోగిని స్థానికులు పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై మట్టెవాడ పోలీసులను వివరణ కోరగా మహిళను పోలీస్‌స్టేషన్ నుంచి ఆస్పత్రికి పంపించామన్నారు.

బాలుడి అదృశ్యం

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పని చేసేందుకు బీహార్ రాష్ట్రం నుంచి వచ్చిన పూనం కుమారి అనే మహిళ కుమారుడు రిహాన్‌రాజ్ (1) అదృశ్యం అయినట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై రాజన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రోజు ఉదయం 8 గంటల నుంచి కనబడడం లేదని, తమతో వచ్చిన రాహుల్ అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లుగా బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సమస్యలు తెలుసుకుంటున్న నాయిని

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 30వ డివిజన్‌లోని పలు కాలనీల్లో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ సర్కార్ నిర్వీర్యం చేస్తూ పేదలపై అనేక విధాలుగా ధరలభారం మోపుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను, దాడులను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ, బొమ్మతి విక్రమ్, రమేష్, సారంగం, యాదగిరి, ఈశ్వర్, చందు, సుధాకర్, రాజు, కళ్యాణ్, భరత్, సుజాత, రజిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

యాభై ఏళ్ల తర్వాత కలిశారు..



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి: మండలంలోని పెగడపల్లి జిల్లా పరిషత్ పాఠశాల 1971–72 పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం జరిగింది. యాభై ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకుని గత స్మృతులను నేమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధనలు నేర్పించిన ఉపాధ్యాయుడు ఏకనాధంతో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మంజుల, మధుసూదన్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పెద్ది ప్రభాకర్‌రెడ్డి, పెద్దోజు ఈశ్వరయ్య, చల్లా రాజిరెడ్డి, వలుస రాజసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పుల్యాల రవీందర్‌రెడ్డి కోరారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మొక్కజొన్న, వరి పంటకు ఎకరానికి రూ.50 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.1 లక్ష నష్టాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్ది మహేందర్‌రెడ్డి, నాయకులు సంపత్‌రెడ్డి, పెద్ది కిషన్‌రెడ్డి, కానుగుల నాగరాజు, సమ్మిరెడ్డి, ముష్కి వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

గూడ్స్ కన్సల్టెన్సీ ఓనర్ల సంక్షేమానికి కృషి



నరేందర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఖిలా వరంగల్: ఆటో, గూడ్స్ కన్సల్టెన్సీ ఓనర్ల సంక్షేమానికి కృషి చేస్తానని రైల్వేగేట్ ప్రాంత జాక్ కన్వీనర్, రిటైర్డ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దిడ్డి నరేందర్ హామీ ఇచ్చారు. వరంగల్ రైల్వేగేట్ పెరకవాడలో నరేందర్‌ను ఆటో గూడ్స్ కన్సల్టెన్సీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గూడూరు సదానందం, బండా శ్రీనివాస్‌లు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నరేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బూర్గం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రాపా కట్టయ్య, కోశాధికారి నిమ్మల సుధాకర్ పాల్గొన్నారు.

మోదీని విమర్శించడం తగదు

న్యూశాయంపేట: ప్రధాని నరేంద్రమోదీని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ విమర్శించడం తగదని బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈడీ, సీబీఐ విచారణలతో వారికి బుర్ర పనిచేయడం లేదన్నారు. ఇప్పటికైన నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు.

పరామర్శ

హన్మకొండ: హనుమకొండ వడ్డెపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నల్ల దయాకర్ మంగళవారం మృతి చెందగా భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ మృతుడు నల్ల దయాకర్ భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్పొరేటర్ ఇమ్మడి లోహిత, ఇమ్మడి రాజు, కుమారస్వామి, ఆశీర్వాదం, సుధాకర్, దయానందం, స్నేహిత్‌లు పాల్గొన్నారు.

టవర్ నిర్మించొద్దని ఆందోళన

ఖిలా వరంగల్: వరంగల్ 26వ డివిజన్ చార్‌బౌలిలో ఎయిర్‌టెల్ టవర్ నిర్మించొద్దని మంగళవారం కాలనీ వాసులు ఆందోళన నిర్వహించారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం కాలనీ ప్రతినిధులు బల్దియా అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఎన్ఎస్ఎస్ పీఓకు అభినందనలు

ఖిలా వరంగల్: ఛత్తీస్‌గఢ్‌లోని గురుఘాసిదాస్ సెంట్రల్ యూనివర్సిటీలో ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ వాల్యానాయక్, వలంటీర్ జ్యోత్స్నలు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఏడు రోజుల శిబిరాన్ని పూర్తి చేసుకుని కళాశాలకు వచ్చిన వారికి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, రహిమొద్దీన్, సుధాకర్, రమేష్, రెడ్డప్ప, రుద్రాణి, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ముహూర్త బలం కీలకం

రామన్నపేట: ప్రతి పనిలో ముహూర్త బలం కీలకమని ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణుడు డాక్టర్ కాళేశ్వరం సుమన్‌శర్మ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో మోహన ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ శోభకృత్ ఉగాది వేడుకల్లో ఆయన ముహూర్త బలంపై చేసిన ప్రసంగంతో ప్రతిఒక్కరు ఆకర్షితులయ్యారు. దీంతో ఆయనను ఘనంగా సత్కరించారు.

స్వయం పరిపాలన దినోత్సవం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు పాఠాలు బోధించారు. కార్పొరేటర్ శివకుమార్, ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన చైతన్య బైక్ యాత్ర

నయీంనగర్: పెరిగిన ధరలకు నిరసనగా ప్రజలను చైతన్యం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా జన చైతన్య బైక్ యాత్ర నిర్వహిస్తున్న తూతిక ప్రకాశ్ తెలిపారు. మంగళవారం హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని ఏప్రిల్ 10వ తేదీన భద్రాచలం నుంచి యాత్ర ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు నిరుద్యోగుల దీక్ష

విద్యారణ్యపురి: టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షల పేపర్ లీకేజీపై నిరసన తెలియజేసేందుకు నిరుద్యోగుల దీక్షను నేడు (బుధవారం) హనుమకొండలోని అంబేడ్కర్ చౌరస్తాలో చేపట్టనున్నట్లు అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వరంగల్ మహానగర కార్యదర్శి సుజిత్ తెలిపారు. మంగళవారం హనుమకొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు

హసన్‌పర్తి: ఎస్సీ వర్గీకరణ చేస్తామని మోసం చేసిన బీజేపీకి రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ అన్నారు. ఎంఎస్‌పీ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం హసన్‌పర్తి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంఎస్‌పీ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఈనెల 31న కలెక్టరేట్లను ముట్టడించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా నాయకుడు రాజారపు భిక్షపతి, సాంబారాజు, రేనుకుంట్ల దుర్గాప్రసాద్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఓహెచ్ఈ తీగ చోరీ

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధి హసన్‌పర్తి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఓహెచ్ఈ విద్యుత్ తీగ చోరీ అయినట్లు మంగళవారం రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 50 మీటర్ల ఓహెచ్ఈ విద్యుత్ తీగ చోరీ అయినట్లు రైల్వే సిబ్బంది ఫిర్యాదు చేయడంతో అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వందేభారత్‌పై దాడి ఘటనలో ఒకరి అరెస్ట్

కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల ఆలేరు సెక్షన్‌లో సికింద్రాబాద్–విశాఖపట్నం వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి చేసినట్లు రైల్వే అధికారులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కాజీపేట రైల్వే పోలీసులు వెళ్లి విచారణ చేపట్టి రాళ్ల దాడి చేసిన ఓ నిందితున్ని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు

కాజీపేట అర్బన్: యాసంగి(రబీ) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. హన్మకొండ జిల్లా సమీకృత కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం 2022–23 సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకై సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.

బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్ష ఫీజు తగ్గించాలి



కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కోర్సుల సెమిస్టర్, ఇయర్ వైజ్ కోర్సుల బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్ష ఫీజు అధికంగా ఉన్నాయని, ఆ ఫీజులను వెంటనే తగ్గించాలని ప్రగతి శీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నర్సింహరావు బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు సల్మాన్ కోరారు. మంగళవారం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి. మల్లారెడ్డికి వినతిపత్రం అందించారు. ఫీజులు వేలల్లో ఉండటంతో నిరుపేద విద్యార్థులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. నాయకులు రమేశ్, కాశీనాథ్, శ్రీకాంత్, భాస్కర్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.